మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 35
పేజీలు : 3

శుక్రవారం
22.08.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను

కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం/ జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.

అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.

GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook

# బీజేపీ బిగ్ స్కెచ్

## మెజార్టీ లేకున్నా బిల్లు



## పార్లమెంటు ఆమోదం లభిస్తుందా?

## తెరపైకి '130వ రాజ్యాంగ సవరణ బిల్లు

**టీ మీడియా,ఆగస్టు 21,ఢిల్లీ బ్యూరో :** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగియడానికి సరిగ్గా ఒకరోజు ముందు (ఆగస్టు 20న) లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓ బిల్లుపై ఇప్పుడు వాడివేడి చర్చ జరుగుతోంది. అదే '130వ రాజ్యాంగ సవరణ బిల్లు'. లోక్‌సభ, రాజ్యసభల్లో మూడింట రెండోవంతు మెజారిటీ ఉంటేనే రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభిస్తుంది. కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారుకు ప్రస్తుతం అంతటి సంఖ్యాబలం లేదు. ఐదేళ్లకు మించి శిక్షపడే కేసులతో 30 రోజులకు మించి జైల్లో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర/రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించే వివాదాస్పద ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. పార్లమెంటులో మూడింట రెండోవంతు మెజారిటీ లేదని తెలిసి కూడా ఈ బిల్లును కేంద్రం ఇప్పుడే ఎందుకు తెరపైకి తెచ్చింది? దీని వెనుక బీజేపీ రాజకీయ వ్యూహం ఏంటి? విపక్ష పార్టీల వాదన ఏంటి? ప్రతిపాదిత బిల్లు ముసాయిదాలోని కీలక అంశాలు ఏంటి? ఈ కథనంలో చూద్దాం.

### ఏమిటీ '130వ రాజ్యాంగ సవరణ బిల్లు'?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 75, ఆర్టికల్ 164, ఆర్టికల్ 239ఏఏలలో సవరణలు చేయడమే '130వ రాజ్యాంగ సవరణ బిల్లు' ప్రధాన లక్ష్యం. ఐదేళ్లకు మించి శిక్షపడే అభియోగాలతో కూడిన కేసుల్లో నిందితుడిగా 30 రోజులకుపైగా జైలులో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర/రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించాలనే కీలక ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. అంటే ఆయా కేసుల్లో వారు దోషులుగా తేలకముందే పదవుల నుంచి తప్పించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. కేవలం ఐదేళ్లకు మించి శిక్షపడే అభియోగాలతో నమోదైన కేసులు, జైలులో 30 రోజులకుపైగా ఉండటాన్ని ప్రాతిపదికలుగా చేసుకొని ప్రధాని, సీఎంలు, మంత్రులను తొలగించొచ్చని బిల్లులో పొందుపర్చడం గమనార్హం. ఈవిధంగా పదవిని కోల్పోయే నేతలు, జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ ఆ పదవిని చేపట్టొచ్చని కూడా బిల్లులో ప్రస్తావన ఉంది.

### ప్రధాని, సీఎంలు, మంత్రుల తొలగింపు- ఎందుకు?

'130వ రాజ్యాంగ సవరణ బిల్లు'కు సంబంధించిన లక్ష్యాలు, కారణాలను దాని ముసాయిదా బిల్లు (డ్రాఫ్ట్ బిల్)లో స్పష్టంగా ప్రస్తావించారు. "ప్రజాప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. అందుకే వారు ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి. రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి ప్రజా ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి. అనుమానాలకు తావు ఇవ్వకుండా ప్రజాప్రతినిధుల ప్రవర్తనా విధానం, నడవడిక, వ్యవహార శైలి ఉండాలి" అని ముసాయిదా బిల్లులో పొందుపరిచారు. "పీఎం, సీఎంలు, మంత్రుల్లో ఎవరైనా తీవ్ర నేర అభియోగాలతో అరెస్టై జైలుపాలైతే, వారు రాజ్యాంగ నైతికతకు, సుపరిపాలన సూత్రాలకు విరుద్ధంగా నడుచుకున్నట్టు. ప్రజలు పెట్టుకున్న రాజ్యాంగబద్ధమైన విశ్వాసాన్ని ఆ నేత వమ్ము చేసినట్టు" అని ఈ బిల్లు చెబుతోంది. తీవ్ర నేర అభియోగాలతో కూడిన కేసుల్లో అరెస్టై జైలులో ఉండే మంత్రులను తొలగించేందుకు ప్రస్తుతానికి భారత రాజ్యాంగంలో ఎలాంటి నిబంధన లేదనే అంశాన్ని ఈ బిల్లు గుర్తుచేస్తోంది.

> **రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం కోసమే ఈ బిల్లు : విపక్షాలు**
>
> రాష్ట్రాలపై పెత్తనం చేయాలని కేంద్రంలోని మోదీ సర్కారు కోరుకుంటోందని, అందుకే '130వ రాజ్యాంగ సవరణ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టిందని విపక్ష పార్టీలు అంటున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు, మంత్రులను వేధించాలనే పన్నాగంతోనే ఈ బిల్లును రూపొందించి ఉంటారని ప్రియాంకాగాంధీ (కాంగ్రెస్), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ) ఆరోపించారు. ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే దేశంలో వ్యక్తిగత స్వేచ్ఛకు చోటు ఉండదని, ప్రజాస్వామ్యం అంతం అవుతుందని శివసేన పేర్కొంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలపై ఉక్కుపాదాన్ని మోపేందుకు చట్టాలు చేయాలని ఆలోచించడం కూడా చాలా దారుణ విషయమని మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. నిరంకుశ పోలీసు రాజ్యం తేవాలనే కుట్ర ఎన్‌డీఏ సర్కారు మదిలో ఉన్నట్టుగా కనిపిస్తోందన్నారు.

### పార్లమెంటు ఆమోదం లభిస్తుందా?

'130వ రాజ్యాంగ సవరణ బిల్లు'కు పార్లమెంటు ఆమోదం లభించడం ప్రస్తుతానికైతే అంత సులభం కాదు. ఎందుకంటే లోక్‌సభ, రాజ్యసభల్లో ఎన్‌డీఏ కూటమికి మూడింట రెండోవంతు మెజారిటీ లేదు. లోక్‌సభలోని మొత్తం ఎంపీల సంఖ్య 542. ఇందులో మూడింట రెండోవంతు మెజారిటీతో బిల్లుకు ఆమోదాన్ని పొందాలంటే 361 మంది ఎంపీల మద్దతు అవసరం. కానీ అధికార ఎన్‌డీఏ కూటమికి లోక్‌సభలో 293 మంది ఎంపీలే ఉన్నారు. రాజ్యసభలోని మొత్తం ఎంపీల సంఖ్య 239. ఇందులో మూడింట రెండోవంతు మెజారిటీతో బిల్లుకు ఆమోదాన్ని పొందాలంటే 160 మంది ఎంపీల మద్దతు అవసరం. కానీ ఎన్‌డీఏకు రాజ్యసభలో 132 మంది ఎంపీలే ఉన్నారు. ఈ రెండు సభల్లోనూ కొన్ని విపక్ష పార్టీల ఎంపీలు ఎన్‌డీఏకు అనుకూలంగా ఓట్లు వేసినా, ఈ బిల్లు పాస్ కావడం అనేది దాదాపు అసాధ్యమే. ఒకవేళ అనూహ్యంగా ఈ బిల్లు పార్లమెంటులో పాసైతే, తదుపరిగా దీన్ని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతారు. ఈ బిల్లులోని అంశాలు భారతదేశ సమాఖ్య వ్యవస్థకు, రాష్ట్రాలకు సంబంధించినవి. అందుకే దీనికి దేశంలోని కనీసం సగం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆమోదాన్ని పొందాల్సి రావచ్చు. దీన్ని ఈజీగానే బీజేపీ గట్టెక్కుతుంది. ఎందుకంటే మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీయే అధికార పీఠంపై ఉంది. ఇదంతా జరిగిపోయినా, చివరకు ఈ బిల్లును సుప్రీంకోర్టులో ఎవరైనా సవాల్ చేసే అవకాశం ఉంది. "దోషిగా నిర్ధారణ అయ్యే వరకు నిందితుడు అమాయకుడే" అనే అంశాన్ని ప్రస్తావిస్తూ, మంత్రులు, సీఎంలను దోషులుగా తేలకముందే పదవుల నుంచి తప్పించడం సరికాదని పిటిషనర్లు సుప్రీంకోర్టులో వాదనలు లేవనెత్తే ఛాన్స్ ఉంది.



### విపక్షాన్ని డైవర్ట్ చేసే వ్యూహం!!

ప్రస్తుతం 'ఓట్ల చోరీ' అంశం గురించి విపక్ష పార్టీలు ప్రధానంగా గళమెత్తుతున్నాయి. 2 నెలల్లోగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఆరోపిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీజేపీ దుర్వినియోగం చేస్తోందని విమర్శిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఆగస్టు 20న లోక్‌సభలో విపక్షాల నిరసనల నడుమ '130వ రాజ్యాంగ సవరణ బిల్లు'ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. ఈ బిల్లును తదుపరిగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపేందుకు ఎన్‌డీఏ సర్కారు రెడీ అవుతోంది. జేపీసీలో 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఉంటారు.

మరోవైపు రాజకీయాల్లోని నేర చరితులకు ప్రధాని, సీఎంలు, మంత్రులు వంటి కీలక పదవులు దక్కకుండా చేయడమే తమ లక్ష్యమని బీజేపీ వర్గాలు వాదిస్తున్నాయి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయి జైలులో ఉన్నా, సీఎం పదవికి మాత్రం రాజీనామా చేయలేదని గుర్తు చేస్తున్నారు. ఇలాంటి సమయాల్లో సీఎంను, మంత్రులను తొలగించే నిబంధన రాజ్యాంగంలో ఉండాలని బీజేపీ నేతలు అంటున్నారు. రాజకీయాలను ప్రక్షాళన చేయడమే తమ లక్ష్యమని చెబుతున్నారు. అయితే ఈ బిల్లుపై ఏర్పాటు చేసే జేపీసీని ఇండియా కూటమిలోని విపక్ష పార్టీలు బహిష్కరించే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే, రాజకీయాల్లోని నేర చరితులకు విపక్షాలు అండగా నిలుస్తున్నాయనే వాదనతో బిహార్ ఎన్నికల బరిలోకి దూకాలని బీజేపీ పెద్దలు యోచిస్తున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. 'ఓట్ల చోరీ'పై జరుగుతున్న చర్చను మసకబార్చేందుకే '130వ రాజ్యాంగ సవరణ బిల్లు'ను కేంద్రం తెరపైకి తెచ్చిందని పలు విపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు.

---

# 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

### స్పీకర్ కీలక నిర్ణయం

**టీ మీడియా,ఆగస్టు21,హైదరాబాద్ బ్యూరో:** సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలని స్పీకర్ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. న్యాయ సలహా అనంతరమే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. బీఆర్?ఎస్?కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో దానిపై అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించారని సమాచారం. ఆ తర్వాతే ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది.కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని బీఆర్?ఎస్? కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారందరికీ నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకొన్న తర్వాత స్పీకర్

మిగతా 3లో..

# ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**టీ మీడియా,ఆగస్టు 21, పాలేరు ప్రతినిధి(ఖమ్మం):** ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు గురువారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు.

మిగతా 3లో..

# జీఎస్టీలో రెండు శ్లాబు రేట్లు

### మంత్రుల బృందం ఆమోదం




**టీ మీడియా,ఆగస్టు 21,ఢిల్లీ బ్యూరో : :** ప్రజలపై జీఎస్టీ భారం తగ్గనుంది. జీఎస్టీలో రెండు శ్లాబులు ఉంచాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందంఆమోదం తెలిపింది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతంగా ఉన్న నాలుగు స్లాబ్‌ల స్థానంలో 5, 18శాతం స్లాబ్‌లను మాత్రమే కొనసాగించాలని, 12, 28 స్లాబ్‌లను తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఆరు రాష్ట్రాల మంత్రులతో కూడిన బృందం ఆమోదం తెలిపినట్లు బిహార్ ఉప ముఖ్యమంత్రి, జీవోఎం కన్వీనర్ సామ్రాట్ చౌదరి తెలిపారు. దిల్లీలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జీవోఎంలో ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, బంగాల్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మంత్రులు సభ్యులుగా ఉన్నారు.జీఎస్టీ పన్ను స్లాబ్‌ల తగ్గింపుతో ప్రజలు, రైతులు, ఎంఎస్‌ఎంఈలకు ధరల భారం నుంచి కొంత మేర ఊరట లభించనుంది. అల్ట్రా లగ్జరీ కార్లపై 40శాతం పన్ను అంశం కూడా కేంద్రం ప్రతిపాదనల్లో ఉన్నట్లు ఉత్తరప్రదేశ్ ఆర్థికమంత్రి సురేష్‌కుమార్ ఖన్నా తెలిపారు. 12శాతం స్లాబ్‌లోని వస్తువులను 5శాతం పరిధిలోకి, 28శాతం పరిధిలోకి వస్తువులను 18శాతం స్లాబ్‌లోకి తెచ్చే అవకాశం ఉంది.

# కేటీఆర్ నిర్ణయం.. కవిత లేఖాస్త్రం

### బీఆర్ఎస్ అధిపత్య పోరు

**టీ మీడియా,ఆగస్టు21,హైదరాబాద్ బ్యూరో:** బీఆర్ఎస్ పార్టీలో అధిపత్యం కోసం జరుగుతున్న అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకొంది. ఇంకా చెప్పాలంటే.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్‌కు కుమార్తె కల్వకుంట్ల కవిత మధ్య పరిస్థితి ఉప్పు నిప్పుగా మారింది. అలాంటి వేళ.. కవిత ఎపిసోడ్‌పై బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కవితను ఆమె పదవి నుంచి సోదరుడు కేటీఆర్ తొలగించారు. కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో అమెరికా పర్యటనలో ఉన్న కల్వకుంట్ల కవిత స్పందించారు.ఆ క్రమంలో సింగరేణి కార్మికులకు కవిత గురువారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తన సోదరుడు కేటీఆర్ లక్ష్యంగా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీలో తాజాగా ఇటీవల చోటుచేసున్న పరిణామాలపై కె. కవిత తీవ్ర ఆందోళన చెందారు. బీఆర్ఎస్ పార్టీలో తనపై కుట్ర జరుగుతోందని కవిత మరోసారి ఆరోపించారు.



తాను ప్రశ్నించినందునే పార్టీలో తనపై కొందరు కక్ష కట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ హితం కోరి తాను మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీలోని నేతలు తన పట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖ తర్వాత తనను వేధింపులకు గురిచేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనలో ఉండగా.. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తనను టీబీజీకేఎష్ నుంచి తొలగించారని ఆ లేఖలో ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

### విదేశీ పర్యటనలో కవిత..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు , ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆమె చిన్న కుమారుడు ఆర్యకు అమెరికా యూనివర్సిటీలో సీట్ వచ్చింది. దీంతో అతడిని యూనివర్సిటీలో జాయిన్ చేసేందు ఆర్యతో కలిసి ఆమె అమెరికాకు వెళ్లారు. ఈ పర్యటనకు వెళ్లే ముందు బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తన కుటుంబంతో కలిసి కవిత కలిశారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో తండ్రి కేసీఆర్ నుంచి కల్వకుంట్ల కవిత కుటుంబం ఆశీర్వాదం తీసుకుంది. ఆ వెంటనే కవిత కుటుంబం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆ మరునాడే తన కుమారుడితో కలిసి.. కవిత అమెరికాకు పయనమైయ్యారు. ఆమె విదేశీ పర్యటనలో ఉండగా.. సింగరేణి సంస్థలకు చెందిన పదవిని కొప్పుల ఈశ్వర్‌కు కేటీఆర్ కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులను ఉద్దేశిస్తూ.. కల్వకుంట్ల కవిత అమెరికా నుంచి లేఖ రాశారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో అన్నచెల్లమ్మల మధ్య పోరు తార స్థాయికి చేరిందనే వార్తలు వెలువడుతున్నాయి.

### ఓకే ఒక్కడు

# రూ.400 కోట్ల భూ కబ్జా

- చెర నుంచి రోడ్డును కాపాడిన హైడ్రా
- అక్రమనిర్మాణాల కూల్చివేత

**టీ మీడియా,ఆగస్టు 21,శేరిలింగంపల్లి :** రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రోడ్లను ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 ఆక్రమణకు (దాదాపు 8,500 గజాలు) గురయ్యాయి. అలాగే 5,000 గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఈ విధంగా మొత్తం 16000 గజాల స్థలాన్ని అక్రమణదారుల నుంచి హైడ్రా కాపాడింది. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది.



### హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు

ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా నిర్వహించే ప్రజావాణిలో కంప్లైంట్ చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్లుగా సూచిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్?ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్టు హైడ్రా అధికారులు వెల్లడించారు.

### జైహింద్‌రెడ్డిపై ఫిర్యాదులు

హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల సర్కారు స్థలాన్ని ఆక్రమించి అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రాకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయాన్ని పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దెను వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ(గ్రేటర్? హైదరాబాద్? మున్సిపల్ కార్పొరేషన్) నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ ఓనర్లకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ భూమి అయితే సర్కారుకు చెందుతుందని మధ్యలో జైహింద్ రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది. హైదరాబాద్? నగరంలో నీటి వనరులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకోసం పనిచేస్తున్న హైడ్రా ఇప్పటికే పలు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపింది. అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడింది.

### వరద ముప్పులేని నగరంగా భాగ్యనగరం

గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి, వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్?ను తీర్చిదిద్దాలనేదే హైడ్రా ముఖ్య లక్ష్యమని రంగనాథ్ కొద్ది రోజుల క్రితం వివరించారు. ఈ క్రమంలోనే చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు ఆక్రమణలను నిరోధించి, ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు.

# నమ్మకం, భరోసా కల్పించాలి..

• **పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ**

**టీ మీడియా,ఆగస్టు 21, పెద్దపల్లి బ్యూరో :**
పోలీసులు ప్రజల భద్రత,రక్షణ,బాధితులకు న్యాయం చేయడానికి 24ు7 ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీస్ అధికారులు పనిచేయాలని,పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది అనే నమ్మకం,భరోసా కల్పించాలనీ పోలీస్ అధికారులు రామగుండం పోలీస్ కమిషనర్ సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ధర్మారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు.ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు,కోర్టు కేసులు,ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు




ఆదేశాలు జారీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు,లా అండ్ ఆర్డర్ ఇషఢ్యస్, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే తదితర అంశాలను ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు వివరాలు,వారు పై ఉన్న కేసుల వివరాలు,ప్రస్తుత పరిస్థితులు,వారి కదలికల గురించి,అనుమానితులు, కేడీ,డిసిల వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు,వారు చేస్తున్న విధులు,పని తీరు,వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పిర్యాదుల విషయం లో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలి అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేయాలని ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి పోలీసు అధికారులు రెవెన్యూ రవాణా,నేషనల్ హైవే అథారిటీ,గ్రామ పంచాయతీ,రోడ్డు భవన్ ల శాఖ వారి సమన్వయంతో ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.పెద్దపల్లి జిల్లాలో ధర్మారం పోలీస్ స్టేషన్ ముఖ్యమైనది.ఈ ప్రాంత అభివృద్ధి కూడా జరుగుతుంది.కావున ఈ ప్రాంతంలో ఏ విధమైన నేరాలు జరుగుతున్నాయి ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోవాలి అని ఎస్ఐ కి ఆదేశాలు సూచనలు చేయడం జరిగింది.గతంలో ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు లేవు అదేవిధంగా భవిష్యత్తులో కూడా కొనసాగించాలి. ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలి.ఎవరి వైపు న్యాయం ఉంటుందో పోలీసు వారి వైపు ఉండాలి అన్నారు.ధర్మారం పోలీస్ స్టేషన్ పరిధి ప్రజలకు తెలియజేయు ఏమనగా ఏదైనా బాధ ఇబ్బంది ఉన్నట్లయితే నేరుగా పోలీస్ స్టేషన్ కి రావాలని 24ు7 పోలీసులప్పుడు అందుబాటులో ఉంటుందని బాధితులకు న్యాయం చేయడానికి పోలీస్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ధర్మారం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది యొక్క పనితీరుని సిపి అభినందించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ,డీసీపీ చేతుల మీదుగా మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్,పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐ ప్రవీణ్ కుమార్,ఉన్నారు.



## దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించిన ప్రత్యేక కార్యదర్శి

**టీ మీడియా, ఆగస్టు 21,మహబూబ్ నగర్ :**
ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలు వరదలకుదెబ్బతిన్న ప్రాంతాలను రెవెన్యూ ( విపత్తుల నిర్వహణ శాఖ ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఅరవింద్ కుమార్గురువారం సందర్శించారు. దివిటిపల్లి అమరాజా ఫ్యాక్టరీ కి వెళ్లే టీజీఐఐసీ కాంప్లెక్స్ వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్డును, అమిస్తాపూర్ నుంచి రామదాసు తండా మధ్య దెబ్బతిన్న రోడ్డును, జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలెజీ వెళ్లే వర్షపు నీటి తో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు.దెబ్బతిన్న రహదారి, రైల్వే అండర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులు గురించి కలెక్టర్ విజయేందిర బోయి, సంబంధిత రైల్వే, మున్సిపల్ , అధికారులు వివరించారు. జడ్జర్ల మండలం చిట్టిబోయినపల్లి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులున్నారు.

## మద్యం మత్తులో ఎమ్మెల్యే అనుచరులు, పీఏల హల్‌చల్

**టి మీడియా, ఆగస్టు 21, బెల్లంపల్లి :**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా జాతీయ రహదారిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏలు, క్యాడర్ హల్చల్ చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేస్తూ, చిందులు వేస్తూ కేరింతలు కొట్టారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రభుత్వ పీఏ రామకృష్ణ, డ్రైవర్ మోసిన్, శేఖర్, పీఏ గడ్డం ప్రసాద్, రామకృష్ణ, ఎమ్మెల్యే సన్నిహితుడు రమేష్, యూత్ నాయకుడు శ్యామ్ రోడ్డుపై చిందులు వేశారు.అటువైపుగా వెళ్తున్న వాహన



చోదకులు, ప్రజలు భయభ్రాంతులకు గురై ఇబ్బందులు పడ్డారు. నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో చిందులు వేసిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జల్సాలు చేసుకోవాలి కానీ ఇలా బహిరంగంగా చిందులు వేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నీటిని వదులుతున్న జూరాల ప్రాజెక్టు అధికారులు

**టీ మీడియా, ఆగస్టు 21 ,ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా అమరచింత మండలం జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారి కృష్ణానది లో వరద పోటెత్తిపోతుంది. మహారాష్ట్ర కర్ణాటక కృష్ణ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరువలు తొక్కుతూ దిగువకు వెళుతుంది. ఆల్మట్టి డ్యాం నిండడంతో నారాయణపూర్ ప్రాజెక్టుకు నీటిని వదిలారు. నారాయణపూర్ ప్రాజెక్టు కూడా నిండడంతో ఐదు గేట్లు తెరిచి జూరాల వైపు విడుదల చేశారు. 41 గేట్ల ద్వారా 3,81,225 క్యూసెక్కుల నీరు జూరాల ప్రాజెక్టుకు విడుదల చేశారు. కృష్ణమ్మ ఉగ్రరూపంతో శ్రీశైలం వరకు పరవాళ్ళు తొక్కుతూ వెళ్తుంది. 41 గేట్లు తెరచిన జూరాల



ప్రాజెక్టు అధికారులు.ప్రాజెక్టులోని 41 గేట్లు ఎత్తి దిగువకు 3 లక్షల 81 వేల225 క్యూసెక్కుల నీరు విడుదల విడుదల చేస్తున్నట్టు తెలిపారు. 41 గేట్లు ద్వారా ఓపెన్ చేసి దిగువకు శ్రీశైలము వైపు విడుదల చేసిన అధికారులు, కర్ణాటక నుండి ఇన్ ఫ్లో 3,65,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో 2,75,106 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 318.516 మీటర్లు, ప్రస్తుతం 316.460 గా ఉంది. ప్రస్తుతం నీటిమట్టం ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో 6 యూనిట్లలో ఉత్పత్తి అవుతుంది, దిగువ జూరాల జల ఉత్పత్తి 6 జరుగుతున్నాయి.

## ప్రైవేట్ జూనియర్ కళాశాలలు,తనిఖీ చేయాలి

• **విద్యాధికారి కి వినతి పత్రం**

**టీ మీడియా,ఆగస్టు 21,పెద్దపల్లి :**
జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలు,ఓకేషనల్ జూనియర్ కళాశాలలను తనిఖీ చేయాలని ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ ఈర్ల రామచందర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన కు



గురువారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి కళాశాలను తనిఖీ చేసి నియమ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అలాగే కనీస వసతులు లేని కళాశాలలో ఎన్నో ఉన్నాయ ని గ్రౌండ్ పార్కింగ్ లాంటి విషయాలు ఎన్నో ఇంకా వినతి పత్రం ద్వారా తెలియజేశారు.

## హెడ్ కానిస్టేబుల్ రాజశ్రీకి ఏఎస్ఐగా పదోన్నతి

**టీ మీడియా , ఆగస్టు 21, కోరుట్ల :**
పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశ్రీ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పదోన్నతి పొందారు. 1991లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన రాజశ్రీ, గత మూడున్నర దశాబ్దాలుగా నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. దశలవారీగా తన కృషి, కట్టుబాటుతో ఎదిగి ఇప్పుడు ఏఎస్ఐ హోదాకు చేరుకున్నారు.పదోన్నతి అనంతరం ఆమె జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ స్వయంగా



ఏఎస్ఐ పదోన్నతి గుర్తుగా స్టార్ చిహ్నాన్ని అలంకరించి, రాజశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు. పెరిగిన బాధ్యతను మరింత క్రమశిక్షణతో నిర్వర్తించి, ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకం, గౌరవాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు.పదోన్నతి పొందిన రాజశ్రీ ఈ అవకాశాన్ని తన సేవలకు గుర్తింపుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో మరింత నిబద్ధతతో ప్రజాసేవ కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

## ఎర్ర జెండా నీడలో రేణుకుంట్ల రమ, ప్రీతం

**టీ మీడియా,ఆగస్టు 21,రామగుండం ప్రతినిధి :**
మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లా గాజుల రామరం హైదరాబాద్ లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహా సభలకు పెద్దపల్లి జిల్లా నుండి తల్లి -తనయుడు ప్రతినిధులుగా హాజరయ్యారు.ఎర్ర జెండా పట్టుకొని పేద ప్రజల అండ సిపిఐ జెండా అంటూ ఆనాడే నినాదిస్తూ బడుగు,బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయమని పోరు చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై,అఘాయిత్యాల పై ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శిగా అటు తల్లి,విద్యా రంగ సమస్యల పరిష్కారమే నా




కర్తవ్యం అని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ఇటు తనయుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సంఘాలలో చురుకుగా పని చేస్తున్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ లో వారసత్వం కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పార్టీలో చురుకుగా పనిచేస్తునందున రాష్ట్ర నాయకత్వం హర్షించారు.

## పేద మహిళకు సిరి ఫౌండేషన్ చేయూత

**టీ మీడియా, ఆగస్టు 21, రామకృష్ణాపూర్ :**
రామకృష్ణాపూర్ లోని మల్లికార్జున నగర్ కి చెందిన సంధ్యవేణి నాగమణి హై బీపీతో కరీంనగర్ లోని ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స కోసం వెళ్లారు,కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా సిరి ఫౌండేషన్ ను సంప్రదించగా దాతల ద్వారా స్వీకరించిన 12150 రూపాయలను ఆర్థిక సహాయంగా సిరి ఫౌండేషన్ సభ్యులు నాగమణి కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరిగింది.ఈ



సందర్భంగా మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉండి సహాయం కోసం ఎదురుచూసే ప్రతి ఒక్కరికి సిరి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని అన్నారు.నేటి యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని చికిత్స కోసం విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు ఉప్పు శేఖర్, సంతోష్ కుమార్,స్థానిక నాయకులు అర్నె సతీష్, జిలకర మహేష్ సుధాకర్ లు పాల్గొన్నారు.

## యూరియాను అందించడంలో కేంద్రం విఫలం

• **సీపీఎం జిల్లా కార్యదర్శి**

**టీ మీడియా, ఆగస్టు 21,అచ్చంపేట రూరల్:**
తెలంగాణ రైతులకు యూరియా బస్తాలుఅందించడంలో కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని సీపీఎం జిల్లాకార్యదర్శి వర్ధం పర్వతాలు ఆరోపించారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అచ్చంపేట సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం ఎరువులు, యూరియా బస్తాల కోట తగ్గించి రైతులను ఇబ్బందికి గురి




చేస్తుందని పేర్కొన్నారు. పండించిన పంటలను కొనడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నెలల తరబడి నిర్లక్ష్యం చేయగా నేడు ఎరువుల కొరతతో రైతులను ఇబ్బందులపాలు చేస్తుందని మండిపడ్డారు. రైతన్నలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు గాడి తప్పిందన్నారు.సమయానికి పంట పొలాలకు ఎరువులు యూరియా వెయ్యకపోతే రైతులకు తీవ్రనష్టాలు వస్తాయని వెల్లడించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి ఎరువులు, యూరియా, విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్ దేశ నాయక్, సీనియర్ నాయకులు శివకుమార్, ఎం దశరథ%శీ%, సీపీఎం మండల కార్యదర్శి వర్ధ%శీ% సైదులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ ఘటనలు భాధకరం

• **అందుకే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తోంది: సీఎండీ**

**టీ మీడియా,ఆగస్టు21,హైదరాబాద్:**
విద్యుత్ షాక్ ఘటనలు సెంట్రల్ హైదరాబాద్ పరిధిలోనే చోటు చేసుకుంటున్నాయని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో సీఎండీ ముషారవ్ అలీ మాట్లాడుతూ.. టీవీ కేబుల్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ రెగ్యులర్‌గా కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో వర్షా కాలంలో ఇబ్బందులు తలెత్తే.. ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ అంశంపై గ్రేటర్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్స్‌తో చాల సార్లు సమావేశం ఏర్పాటు చేశామని ఈ



సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా వాళ్ళు మారడం లేదన్నారు.
అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. టీజీఎస్పీడీసీఎల్ సూచించిన ప్రమాణాల ప్రకారం కేబుల్ వైర్లు, సర్వీస్ ప్రొవైడర్లను వాడడం లేదన్నారు. ప్రస్తుతం వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలంటూ నగర వాసులకు ఆయన కీలక సూచన చేశారు. కేబుల్స్ కట్ చేయడం వల్ల ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలని ఇప్పటికే కేబుల్స్ ఆపరేటర్స్‌కు సూచించామన్నారు. అయితే కేబుల్స్ కట్ చేయడంపై తెలంగాణ హైకోర్టు కొన్ని కీలక సూచనలు చేసింది.. ఆ క్రమంలో కోర్టు వివరణ ఇచ్చిన తర్వాత.. తదుపరి యాక్షన్ ఉంటుందని సీఎండీ ముషారఫ్ అలీ వెల్లడించారు.కృష్ణాష్టమి సందర్భంగా హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌లో భక్తులు యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో కరెంట్ షాక్ తగిలి ఆరుగురు యువకులు మరణించారు. అలాగే మరో ప్రాంతాల్లో కరెంట్ షాక్ తగిలి మరో ఇద్దరు మరణించారు. అలాగే వినాయకుడి విగ్రహం తీసుకు వెళ్తూ మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుల్లను తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించింది. దీంతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో ప్రభుత్వ చర్యలను కేబుల్ ఆపరేటర్లు ఖండించారు.

## భూ సమస్యల పరిష్కారానికి పట్టిష్ట చర్యలు

• **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**టీ మీడియా,ఆగస్టు 21,పెద్దపల్లి :**
భూ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు.శ్రీరాంపూర్ మండలంలోని కూనారం,ఇదులాపూర్ గ్రామంలో మిస్సింగ్ సర్వే నెంబర్ పట్టా కోసం వచ్చిన దరఖాస్తులను



క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అనంతరం జాఫర్ ఖాన్ పేట,ఇదులాపూర్ గ్రామం లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలను,అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ప్రతి ఒక విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలని,పిల్లలకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకునేలా గ్రహణశక్తి పెంపొందించాలని అన్నారు.అంగన్వాడీ సెంటర్ లను పరిశీలించి ఎంత మంది పిల్లలు వస్తున్నారు. ఎలాంటి ఆహారం ఇస్తున్నారు, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ జగదీశ్వర్ రావు,డి.టి. శంకర్,సర్వేయర్ రాజు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్‌గద్దని చెప్పినందుకు తండ్రిని చంపిన కుమారుడు

**టీ మీడియా, ఆగస్టు 21,వనపర్తి ప్రతినిధి :**
బెట్టింగ్‌కు బానిసై ప్రాణాలను తీసుకోవడమే కాదు ప్రాణాలు తీస్తుందని నిరూపించాడు ఓ కుమారుడు. ఆలస్యంగా తెలిసిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాలోని ఘన్‌పూర్ మండలం కోతులకుంట తండాకు చెందిన కేతావత్ హనుమంతు(37)కు భార్య, ఇద్దరు కొడుకులు రవీందర్(19), సంతోష్ ఉన్నారు. వీరు జీవనోపాధి కోసం గచ్చిబౌలిలోని ఎన్టీఆర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు.హనుమంతు మేస్త్రీగా పని చేస్తుండగా, పెద్ద కొడుకు రవీందర్ ఇంటర్ పూర్తి చేసి జులాయిలా తిరుగుతూ, బెట్టింగ్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. ఇటీవల



అప్పులు పెరిగిపోవడం, కుమారుడి ఉన్నత విద్యకు డబ్బులేక హనుమంతు సొంతూరులోని భూమి తాకట్టు పెట్టి రూ.6 లక్షలు తెచ్చాడు. ఈ డబ్బులపై కన్నేసిన రవీందర్ బ్యాంకులో వేస్తే భద్రంగా ఉంటుందని తన అకౌంట్‌లో రూ.2.5 లక్షలు జమ చేయించుకున్నాడు. ఈ డబ్బులను బెట్టింగ్ యాప్‌లో పెట్టి మొత్తం పోగొట్టుకున్నాడు.అకౌంట్‌లో ఉన్న డబ్బులు విత్ డ్రా చేద్దామని తండ్రి అడగ్గా స్నేహితుడికి ఇచ్చానని, త్వరలోనే ఇస్తాడని నమ్మించాడు. ఈ విషయంలో, అలానే బెట్టింగ్ ఆపాలని తండ్రి హనుమంతు, కొడుకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు.మంగళవారం మధ్యాహ్నం తండ్రి డబ్బుల గురించి నిలదీయగా స్నేహితుడు ఇచ్చేందుకు వస్తున్నాడంటూ ఎన్టీఆర్ నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు.తన స్నేహితుడు డబ్బులతో పాటు సర్‌ప్రైజ్ ఇస్తాడని చెప్పి తండ్రి కళ్లకు రవీందర్ గంతలు కట్టి మాటల్లో పెట్టి అప్పటికే తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై తండ్రి అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు.



## హాస్టల్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

• **కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**టీ మీడియా, ఆగస్టు 21,పెద్దపల్లిబ్యూరో**
బీసీ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వలలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల స్థాయి వసతి గృహాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థులు, స్టాఫ్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను రెగ్యులర్ గా చెక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత జిల్లా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మల్లికార్జున స్వామి ఆలయంలో సామూహిక లక్ష బిల్వార్చన

**టీ మీడియా, ఆగస్టు 21,ఓదెల :**
పెద్దపల్లి జిల్లా ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సామూహిక లక్ష బిల్వర్చన పూజా కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా జరిపారు. శ్రావణమాసం అత్యంత ప్రవిక్యమైనది కావడంతో సకల మానవాళి మంచి కోసం శ్రీ స్వామివారికి మాస శివరాత్రి సందర్భంగా సామూహిక లక్ష బిల్వర్చన పూజలు నిర్వహించారు.అలాగే అమ్మవారికి కుంకుమార్చన, బిల్వపత్రి, బిందతీర్థం, శివ పుణ్యాహ వచనము, మహా హారతి, మంత్రపుష్పం, మారేడు చెట్టు వద్ద పత్రి పూజ తదితర కార్యక్రమాలు జరిగాయి. లక్ష బిల్వార్చన పూజలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మందికి పైగా దంపతులు ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను ఆలయ ఈవో సదయ్య, సిబ్బంది, అర్చకులు కల్పించారు. వేద పండితులు ధూపం వీరభద్రయ్య, భవాని ప్రసాద్, అభిషేక్ తదితరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### ఇన్‌చార్జి ఈవోగా కందుల సుధాకర్

**టీ మీడియా, ఆగస్టు 21,హనుమకొండ :** ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కందుల సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన అద్దంకి నాగేశ్వర్ రావును తొలగించారు. కాగా, కరీంనగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈవోగా పని చేస్తున్న సుధాకర్ ఐనవోలు మల్లికార్జున స్వామి ఇంచార్జీ ఈవో గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు.

# కార్లను అద్దెకు తీసుకుని అమ్మేస్తారు

- **ట్రాకర్‌తో బెదిరించి కిరాయి తీర్చేస్తారు**

**టి మీడియా, ఆగస్టు 21, కామారెడ్డి :**
అంతర్జాలంలో కార్లను అమ్ముతామంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ గ్యాంగ్‌ను కామారెడ్డి జిల్లా పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్‌చంద్ర బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం, ముఠా సభ్యులు తొలుత సెల్ఫ్ డ్రైవింగ్ కోసమని కార్లను అద్దెకు తీసుకుంటారు. వాటి నంబర్‌ప్లేట్‌లను మార్చి ఫేక్ నంబర్‌ప్లేట్‌లను వాటికి అమరుస్తారు. అసలు నంబర్‌ప్లేట్ కలిగి ఉన్న కారు ఓనర్ పేరుతో డూప్లికేట్ ఆర్‌సీ, ఆధార్, ఇతర కార్డులను తయారు చేస్తారు. ఆ తర్వాత కార్లు అమ్ముతామంటూ ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతారు. అమాయకులను నమ్మించి కార్లను రూ.లక్షలకు అమ్మేస్తారు.

**కేసులు పెడతామని బెదిరించి**
కార్లను అమ్మేసే సమయంలో సదరు కార్లకు జీపీఎస్ ట్రాకర్లు అమరుస్తారు. వెంటనే ఒకట్రెండు రోజుల్లో అమ్మిన కార్లను జీపీఎస్ ట్రాకర్ల ద్వారా గుర్తించి, ముఠా సభ్యులు తామే అసలు ఓనర్లమంటూ కార్లు కొన్నవారిని బెదిరిస్తారు. తాము మోసపోయామని కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఫోన్? చేయడానికి ప్రయత్నిస్తే



అవి పనిచేయవు. అప్పటికే ఈ ముఠా సభ్యులు ఆ సిమ్ కార్డులను మార్చేస్తారు. తాము చెప్పినట్టుగా వినకుంటే కేసులు పెడతామని బెదిరించి అమ్మిన కార్లను లాక్కెళ్తారు. ఈ విధంగా తీసుకువచ్చిన కార్లను తొలుత కిరాయికి తెచ్చినవారికే ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటారు. ఓ బాధితుడి ఫిర్యాదుతో : 2025 జులై 18వ తేదీన కామారెడ్డికి చెందిన ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ అనే వ్యక్తి కారు కొని మోసపోయానంటూ మాచారెడ్డి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర ఆదేశాలతో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, కామారెడ్డి గ్రామీణ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్‌ల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి మరింత లోతుగా విచారించి ముఠా సభ్యులను పట్టుకున్నారు. దర్యాప్తు అధికారులను ఎస్పీ అభినందించారు.

**జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం**
మహ్మద్ ఇయాజ్ (రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం గోపినగర్ నివాసి) నేతృత్వంలో మహ్మద్ జాహీద్ అలీ (వికారాబాద్ ఆలంపల్లి వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న రంగారెడ్డి జిల్లా హైదర్‌షా కోటె శాంతినగర్‌వాసి), పృథ్వీ జగదీష్ (సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం), రాచర్ల శివకృష్ణ (సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఉంటున్న వరంగల్ జిల్లా హన్మకొండ మండలం కొత్తవాడవాసి), కర్ణకోట సాకేత్ (రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం), వేములమాడ వివేక్ (సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం), అలీ (పరారీలో ఉన్నాడు) గ్యాంగ్‌గా ఏర్పడి అక్రమాలకు తెరతీశారు. వీరిలో ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 3 కార్లతో పాటు 15 సెల్‌ఫోన్‌లు, కార్ల జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్, 10 మైక్రో సిమ్‌కార్డులు, ఖాళీ చిప్ కార్డులు, ఫోర్జరీ చేసిన ఆర్‌సీలను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు శంకర్?పల్లి, మంచాల, అంబర్‌పేట్, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ తదితర ఠాణాల్లో నమోదైన కేసుల్లో నేరస్థులుగా ఉన్నారు. ఇలాంటి ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. అయినా కొంతమంది పెడచెవిన పెట్టడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

### రూ. 25 లక్షల విలువ చేసే
# ఈ-సిగరెట్లు సీజ్

**టీ మీడియా,ఆగస్టు 21, హైదరాబాద్ :**
హైదరాబాద్ నగరంలో భారీగా ఈ-సిగరెట్లతో పాటు విదేశీ సిగరెట్లు పట్టుబడ్డాయి. అంతర్ రాష్ట్ర స్మగ్లర్ల నుంచి రూ. 25 లక్షల విలువ చేసే నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. నిషేధిత సిగరెట్లను స్మగ్లింగ్ చేస్తున్న వారిని అబ్దుల్లా శెట్టి(ముంబై), మహమ్మద్ తజుద్దీన్(మెహిదీపట్నం), మహమ్మద్ షమీ(గోల్కొండ), మహమ్మద్ సోహైల్ ఖాన్(గోల్కొండ), ఖలీల్ అహ్మద్(బోరబండ), మయాంక్ బైస్(ఇండోర్) గా గుర్తించినట్లు



పోలీసులు పేర్కొన్నారు. ఈ సిగరెట్లను దుబాయి నుంచి అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ప్లాటినం సెవెన్ కూల్ సిగరెట్లు 6800 ప్యాకెట్లు, ఎల్ఫ్‌బర్ ఈ సిగరెట్లు 360 ప్యాకెట్లు, స్కూటర్, ఆరు మొబైల్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శాంతియుత వాతావరణంలో నవరాత్రులు

- **మతాల పెద్దలతో సమావేశం**
- **వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి...**

**టీ మీడియా,ఆగస్టు 21, రామగుండం ప్రతినిధి:**
గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి పీస్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హిందూ,ముస్లిం మత పెద్దలు,వివిధ మండప నిర్వాహకులు అభ్యర్థనలను, సందేహాలు, తెలియ జేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ముందుగా




వినాయక విగ్రహాల ప్రతిష్టపనకు ప్రతి ఒక్కరు ఆన్లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని, మండపల వద్ద నాణ్యమైన ఎలక్ట్రికల్ వైర్స్ ను వాడాలని సూచించారు. అగ్ని ప్రమాద నిరోధక చర్యలు పక్కాగా అమలు చేయాలి,మండపల వద్ద సరైన పార్కింగ్ సదుపాయని ఏర్పాటు చేసుకోవాలి,ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై వినాయక మండపల ఏర్పాటు చేయకూడదు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండపల నుండి బయటికి వెళ్లే మార్గాలను స్పష్టంగా ఏర్పాటు చేయాలి,అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్స్,డిజేల వినియోగం పూర్తిగా నిషేధించాలి,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి,వాలంటీర్లను నియమించి,వారిని పోలీసులతో సమన్వయం కలిగి ఉండేలా చూడాలి. వినాయక విగ్రహాల నిమజ్జనం క్రమబద్ధంగా జరిగేలా ప్రత్యేక మార్గదర్శకాలు పాటించాలి. భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలీసులూ,నిర్వాహకులూ పరస్పర సహకారంతో కలిసి పని చేయాలి,ఉత్సవాల సమయంలో ఎటువంటి మత సంబంధ విభేదాలు రాకుండా సోదరా భావంతో అన్ని పండగలు జరుపుకోవాలని,ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ వారికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమం ఎస్ఐ రమేష్,మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





## సాదాసీదా హెూటల్ అద్దె 5.50 లక్షలు

- **అత్యధిక అద్దె కు వ్యాపారులు పోటీ**
- **కార్పోరేషన్ కు అత్యధిక అధాయం**

**టీ మీడియా,ఆగస్టు 21, గుంటూరు :**
జిల్లాలోనే అమరావతి రాజధాని ఉంది. రాజధాని ప్రాంతంతో పాటు గుంటూరు కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. కార్పోరేషన్ పరిధిలోని ఒక షాపును వేలం పాటలో నెలకి ఐదు లక్షల యాభై వేల రూపాయలకు పాడుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్ధం అవుతోంది. కార్పోరేషన్ పరిధిలోని ఆర్టిసి బస్టాండ్‌కు ఎదురుగా కొల్లి శారద హెూల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉంది. అక్కడ మొత్తం 88 షాపుల్నున్నాయి. ఇవన్నీ కార్పోరేషన్ పరిధిలోకే వస్తాయి. గతంలో వీటి ద్వారా నెలకి 6.80 లక్షల ఆదాయం వచ్చేది. అయితే లీజు గడవు ముగియడంతోనే కార్పోరేషన్ అధికారులు షాపులకు వేలం నిర్వహించారు. 81 షాపుల వేలం పూర్తయ్యే సరికి నెలకి యాభై లక్షల రూపాయల ఆదాయం సమకూరనుంది. గతంలో కంటే అన్ని షాపులకు అత్యధిక అద్దె చెల్లించేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు. ముప్పై వేల నుండి 5.5 లక్షలు చెల్లించనున్నారు. మార్కెట్ మొదట్లో ఉండే 67వ షాపుకు అత్యధికంగా 5.5 లక్షలు నెలనెల అద్దె చెల్లించేందుకు వ్యాపారి ముందుకొచ్చారు. బహిరంగ వేలం పాటలో అత్యధిక రెంటుకు ఈ షాపును దక్కించుకున్నారు. 81 షాపుల ద్వారా కార్పోరేషన్‌కి ఏటా 6 కోట్ల రూపాయల ఆదాయం రానుంది. 67నంబర్ షాపుకు అత్యధిక రెంటు చెల్లించేందుకు ముందుకు రావడానికి ప్రధానం కారణం ఈ షాపులో క్యాంటిన్ నిర్వహిస్తారు. రెండంతస్తుల్లో ఈ షాపు ఉంటుంది. హెూల్ సేల్ మార్కెట్ కావడంతో ఈ క్యాంటిన్ 24 గంటల పాటు నడుస్తోంది. దీంతో ఈ షాపును దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు. 336 చదరపు అడుగులున్న ఈ షాపు ఏకంగా ఐదున్నర లక్షల రూపాయలు పలకడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. పాతికేళ్ల పాటు లీజు ఉంటుందని ప్రతి మూడేళ్లకు 33 శాతం రెంటులో పెంపుదల ఉంటుందని కమీషనర్ పులి శ్రీనివాస్ తెలిపారు. రాజధాని జిల్లా కావడంతోనే అత్యధిక అద్దె వచ్చినట్లు కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది భావిస్తున్నారు.

## ఇన్‌చార్జి ఈవోగా కందుల సుధాకర్

**టీ మీడియా, ఆగస్టు 21,హనుమకొండ :**
ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కందుల సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన అద్దంకి నాగేశ్వర్ రావును తొలగించారు. కాగా, కరీంనగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈవోగా పని చేస్తున్న సుధాకర్ ఐనవోలు మల్లికార్జున స్వామి



ఇంచార్జీ ఈవో గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి

- **విచారణ జరుపుతున్న పోలీసులు**

**టీ మీడియా,ఆగస్టు 21, హైదరాబాద్ :**
హైదరాబాద్ మియాపూర్? పోలీస్? స్టేషన్? పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మక్త మహబూబ్?పేట్? కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో స్థానికుల్లో తీవ్ర విషాదం నింపింది. స్థానికుల ఫిర్యాదుతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుల్లో అత్త, మామ, భార్య, భర్త, రెండేళ్ల చిన్నారి ఉన్నారని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుల్లో ఉప్పరి లక్ష్మయ్య(60), అతని భార్య ఉప్పరి వెంకటమ్మ(55), అల్లుడు అనిల్?(32), కుమార్తె కవిత(24), రెండేళ్ల చిన్నారి



ఉన్నారు. మృతులంతా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడం మండలం రంజోలి వాసులుగా గుర్తించారు. వీరంతా ఒకే ఇంట్లో మృతి చెందడంతో ఇది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే మియాపూర్? పోలీసులు, క్లూస్? టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలు సేకరిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తాయని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులను, బంధువులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబ నేపథ్యం, వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

## 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

### స్పీకర్ కీలక నిర్ణయం



తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఇందులో ఒకరిద్దరు తాము కాంగ్రెస్‌లో చేరలేదని ప్రకటించారు.

**బీఆర్‌ఎస్?, బీజేపీ పార్టీల పిటిషన్లు**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తీర్పు వచ్చిన మూడు నెలల్లో స్పీకర్? నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అంతకు మించి సమయం తీసుకోవద్దని సుప్రీం సూచించింది. అలాగే న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. బీఆర్‌ఎస్? పార్టీ నుంచి కాంగ్రెస్?? పార్టీలోకి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్? కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్?, ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, జి.జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ పిటిషన్లు దాఖలు చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు వేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణ జరిగాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న అనంతరం ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది.

**స్పందించిన స్పీకర్**
అత్యున్నత న్యాయస్థానం తీర్పుపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. తీర్పు కాపీ అందిన తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి ముందుకెళ్లనున్నట్లు వెల్లడించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, వివరణ ఇచ్చేందుకు ఎమ్మెల్యేలు సమయం కోరినట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ వివరించారు. రాష్ట్రపతిని, స్పీకర్లను కోర్టులు ప్రశ్నించలేవని మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల వ్యాఖ్యానించారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రస్తావించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ తెలిపారు.

## ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలు

- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు**

గువ్వల గూడెం గ్రామంలో ఖమ్మం కోదాడ జాతీయ రహదారి నుండి బాల సముద్రం వరకు కోటి 55 లక్షల రూపాయలతో చేపట్టిన బిటీ రోడ్డు నిర్మాణ పనులకు, 25 లక్షలతో నిర్మించనున్న నేలకొండపల్లి ఏరియా పశు ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు, బుద్దారం గ్రామంలో 7 కోట్లతో చేపట్టిన నేలకొండపల్లి గండ్రాయి రోడ్డుపై బ్రిడ్జి పనులకు, అప్పలనరసింహాపురంలో 14 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి



పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి గువ్వల గూడెం గ్రామంలో గతంలో 78 లక్షలు ఖర్చు చేసి అంతర్గత సిసి రోడ్లు వేయడం జరిగిందని, ఆసుపత్రి నిర్మాణానికి 20 లక్షలు మంజూరు చేశామని అన్నారు. గత 20 నెలల కాలంలో గువ్వలగూడెం గ్రామానికి 2 కోట్ల 60 లక్షల వరకు అభివృద్ధి నిధులు మంజూరు చేసామని అన్నారు. నేలకొండపల్లి పట్టణానికి సెంట్రల్ లైటింగ్ మంజూరు చేసామని, కోటి 59 లక్షల రూపాయలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసామని అన్నారు. బౌద్ధ స్తూపం అభివృద్ధికి 2.5 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే వీటికి టెండర్లు పిలుస్తామని, గ్రంథాలయానికి 53 లక్షలు, మొత్తం కలిపి నేలకొండపల్లి మండల కేంద్రానికి దాదాపు 13 కోట్లు అభివృద్ధి కోసం అందించామని మంత్రి తెలిపారు. బుద్ధారం గ్రామంలో 45 లక్షలతో సిమెంట్ రోడ్డు, బుద్ధారం తండా రాజారం పేట నుండి అకారం వాగు వరకు 2 కోట్లు, బుద్ధారం నుంచి రాజారం వరకు కోటి 97 లక్షలతో బీటీ రోడ్డు, మొత్తం గడిచిన 18 నెలల కాలంలో బుద్ధారం గ్రామానికి 11 కోట్ల 40 లక్షల అభివృద్ధి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ కార్యక్రమాలను ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు భరోసా క్రింద 9 వేల కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ, ఉగాది నుంచి రేషన్ లో సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రాబోయే రోజులలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### 250 మెగావాట్ల
# సోలార్ పవర్ ప్రాజెక్టు

- **ముగిసిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం**
- **33 అజెండా అంశాలకు ఆమోదం**

**టి మీడియా, ఆగస్టు 21, అమరావతి బ్యూరో:**కొందరు ఎమ్మెల్యేలు గాడితప్పుతున్న వ్యవహారంలో ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహారం తలనొప్పిగా మారిందని అన్నారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై వస్తున్న ఫిర్యాదులను మంత్రులు లోకేశ్ దృష్టికి తీసుకురాగా అర్హులెవ్వరూ నష్టపోకుండా చర్యలు తీసుకుందామని ఆయన అన్నారు. దస్త్రాల క్లియరెన్స్‌లో అధికారులు ముందున్నారని వారి స్థాయిలో మంత్రులు కూడా వేగం పెంచాలని సూచించారు. అమరావతిలోని సచివాలయంలో దాదాపు 3 గంటలకుపైగా జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం తాజా రాజకీయ పరిణామాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. పలువురు ఎమ్మెల్యేల ప్రవర్తనతీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా వ్యవహారాలపై ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు30కిపైగా అంశాలకు ఆమోదం: మంత్రివర్గ సమావేశంలో 30కిపైగా అజెండా అంశాలకు ఆమోదం దక్కింది. వచ్చే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే 3 ముసాయిదా బిల్లులకు ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ-4.0పై చర్చించారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సంబంధించిన నాలా చట్ట సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాలా పన్ను 4 శాతంలో స్థానిక సంస్థలకు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఎంత ఇవ్వాలి అనే అంశాన్ని మంత్రి మనోహర్ ప్రస్తావనకు తెచ్చారు. 70 శాతం స్థానిక సంస్థలకు, 30 శాతం అథారిటీలకు ఇవ్వాలన్న ఆదేశాలు ఉన్నాయని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టంలోని పలు సెక్షన్ల చట్ట సవరణకు మంత్రివర్గ ఆమోదం లభించింది. 51వ సీఆర్?డీఏ అథారిటీ సమావేశం ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో 904 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు పచ్చజెండా ఊపారు. సీఆర్?డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపుల సమీక్షకు, మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ ప్యాకేజీల పనులకు సంబంధించి ఎల్?-1 బిడ్డర్లుగా ఉన్నవారికి సీఆర్?డీఏ పరిధిలో పనులు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపు కోసం రూపొందించిన మార్గదర్శకాలపై చర్చించారుకాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరులో తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రధాన కాలువ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. చింతూరులోని 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతోపాటు 56 కొత్త పోస్టుల మంజూరు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ ఎస్? మైనేనికి స్పోర్ట్స్ కోటా కింద డిప్యూటి కలెక్టర్‌గా ఉద్యోగం కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాకుళంలో వివిధ క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ఆమోదం దక్కింది2778 పోస్టుల భర్తీకి ఆమోదం: అధికారిక భాషా కమిషన్ పేరును 'మండలి వెంకటకృష్ణారావు అధికారిక భాషా కమిషన్'గా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ స్థాయిని సంక్షేమ అభివృద్ధి కార్యదర్శిగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి ఏపీజీఎస్?డబ్లయూఎస్ చట్టం-2023కు అవసరమైన సవరణలపై కేబినెట్ సమావేశంలో చర్చించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 2778 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. 1785 గ్రామ, వార్డు సెక్రటేరియట్ ఫంక్షనరీలను సముచితంగా మార్చేందుకు 993 కొత్త పోస్టుల మంజూరుకు నిర్ణయం తీసుకున్నారు. మద్యం ప్రాథమిక ధరలు, విదేశీ మద్యం బ్రాండ్లకు టెండర్ కమిటీ సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుపై కేబినెట్ భేటీలో చర్చించారు. మా లక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 100 శాతం ఓనర్‌షిప్‌ను అఖిషియా హెూటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. గుంటూరులోని టీడీపీ కార్యాలయానికి ఉన్న 2954 చదరపు గజాల మున్సిపల్ భూమి లీజు కాలపరిమితిని 33 సంవత్సరాల నుంచి 99 ఏళ్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.